# కల కల్ల కాలేదు !

ఆనాడు రఘు చాల అలజడిగా వున్నాడు.

కలతలూ వుద్రేకాలు ఆయనకేం కొత్తకావు, అయినా? ఆనాటి రఘు అంతరమైన ఆందోళన వింతగా వుంది. ఎర్రబారిన కళ్లలో ఆకాంక్ష కొట్టవచ్చినట్లుగా కన్పిస్తూంది. అద్దంలో నీడల్లాంటి తియ్యటి కోరికల అనుభూతి ఏదో కోతిలాంటి మనస్సును గిల్లుతూ అప్పుడప్పుడు పెదాలపై చిరునవ్వును తళుక్కుమనిపించినా అది వెంటనే సమసిపోతూ వుంది. ఏదో పోగొట్టుకున్నవాడిలా పరిసరాలన్నీ కలియజూస్తున్నాడం. చిన్న అలికిడైనా సరే వులిక్కిపడుతున్నాడు.

'అయితే ఇంకేముంది? మన వాడు ఇన్నినాళ్లకు 'స్వీటొసెన్స్' అంటామే, ఆ తాలూకు రంకురాట్నం ఎక్కి వుంటాడు, అంటూ తన స్వగతాన్ని పక్కవారికి వినబడేలా అనేశాడు రామం.

'ఛా! అదేం కాదు? అంటూ కొట్టిపారవేశాడు మరోస్నేహితుడు. 'కాకపోతే? కారణం మరేమై వుంటుందో? అలోచనలో పడ్డాడు మొదటి మిత్రుడు.

'ఆc, ఏముంటుంది? ఎప్పటి సమస్యే! అహర్నిశలూ నిప్పులా మండే వాడి జన్మతః వచ్చిన బుద్ధి విశేషం, ఆ ఇంటలెక్టు వాడిని కూర్చోనివ్వందే? పుట్టుక వెంబడే ఆ వ్యక్తి చైతన్యస్ఫూర్తిని నిండుగా నింపుకుని మరీ పుట్టాడు. ఎంత చిన్న విషయమైనా సరే స్పందించే చేతనవాడి సొత్తు'.

ఆ మాటకు అడ్డు తగుల్తూ 'ఆవేశం, ఆవేగం, తనకు సొంతమైనా సమతుల్యతను చెదరనియ్యని గట్టిబుర్ర కూడా వుంది, అనే విషయం మరిచిపోకండి! ఎదుటి వారిని ప్రభావితం చేసేందుకు ఎంత తార్కికంగా వుద్వేగంగా మాట్లాడుతాడో అంత తొందరగా యథాస్థితికి చేరుకునే వివేకం కూడా వుంది' అన్నాడు చంద్ర.

'అవును! మనిషి హైలీ సెన్సిటివ్ అయినా మంచి బ్యాలెన్స్‌డ్ హెడ్‌లేన్! ఎంత స్పిరిటెడ్‌గా మాట్లాడుతూ ఎంత ఎమోషనల్ అవుతాడో? ఎదుటి వారి వాదాలు కూడా సబబుగా వున్నప్పుడు అంత తొందరగా ఎమికబుల్ గా, లాజికల్ స్టేజికి చేరుకునే విజ్డం కూడా వుంది. ఇంత నిగ్రహం మనలో ఎవరికి వుంది? చెప్పండి? అందుకే రఘు మూడీగా వుంటూ అసహనాన్ని ప్రకటించినా, రుసరుసలాడినా ఎవ్వరూ అంత సీరియస్‌గా తీసుకోరు. వాడు ఎందుకైనా సమర్థుడే' అంటూ ఖితాబ్ చదివాడు మరో స్నేహితుడు.

'కాదన్నామా? నిలపడం,చెరపడం సమర్థులచేతి చెండాట' ఎందుకూ? ఏంటీ? అంటూ వుల్లికాడ, చొప్పదంటు ప్రశ్నలు మాని, మన పని ఏదో? మనం చేసుకుపోదాం' అంటూ మౌనంగా ఎవరి పనులల్లో వారు మునిగిపోయారు.

ఆలంకారికంగా చెప్పవలసివస్తే 'రఘు' అందంలో చందమామకు 'పెన్నుద్ది అంటే తప్పేమీ లేదు. కానీ, అల్లరి జవరాంద్రకు మాత్రం నిజంగా అందరాని చందమామనే!.'

ఇరవై ఏడు సంవత్సరాల వుక్కు కడ్డీవంటి శరీరంతో, నిరంతరం భ్రమరి తిరిగే వుపగ్రహంలా, వుద్యమ స్ఫూర్తిలా, వుండే రఘును చేరి 'తీయని తీపుల' పంటను పండించుకుందామని వువ్విళ్ళూరినా, సాహసించే ఆడపిల్లలు తక్కువే! ఈ రఘు కేంద్రంగా 'అమ్మో! ఆ దుర్వాసుడా? ఆ విశ్వామిత్రుడా. ఈ సోక్రటీజా? అంటూ వింత వింత పేర్లతో చెప్పుకుని నవ్వుకుంటారు. అయినా అభిమానానికీ, గౌరవానికీ, ఆసక్తికీ, లోటు ఎక్కడా కనిపించదు.

అందరికన్నా 'లాలస' కు రఘు అంటే కొంత లౌల్యం ఎక్కువ, తానై బయటపడ్డ సంఘటనలు కూడా లేకపోలేదు.

మోడులను చిగురింపచేసే ఆటపాటలనూ, కటిక హృదయాలను కరగించి నీరుగా కాల్వలు పారించే విభ్రమ విలాసాలనూ తన సొమ్ముగా ఏలిన వూర్వసి, విశ్వామిత్రుని తపస్సు భంగం చేసి తనకు దాసోహం అనిపిస్తానంటు పంతంతో వచ్చి, ఎన్ని వగలు చూపినా, చలించని ఆ తాపసిని గూర్చి 'మనిషో? మానో? పుంస్త్వంబులేదో? అంటూ విస్తుపోయిన రీతిగా లాలస కూడా' ఆశ్చర్యాన్ని ప్రకటించింది. అయినా వివేకంతో మనస్సును మళ్లించుకుని స్నేహబుద్ధితో మెలగుతూ వుంది.

రఘు లాలసను గౌరవిస్తాడు. ఆమె కత్తిలాంటి చురుకుతనానికీ, నిశిత పరిశీలనకూ, వ్యుత్పత్తికీ, శాస్త్రీయ దృక్పథానికీ మెప్పులు పలుకుతుంటాడు. వీరిద్దరు ఇప్పుడు మంచి స్నహితులు, అంతే కానీ, శరీరంలేని తలతిక్కవాడెవడో ఇద్దరినీ గురిచూసి బాణాలు సంధించిన దాఖలాలు లేవు.

'కొత్త పిలుపు' సమాఖ్యపేరు కొత్తగా వుంది. ఈ సంఘసభ్యులందరూ ఆలోచనాపరులైన విద్యావంతులూ, కళాకారులూ, శాస్త్రవేత్తలూ, కవులు, కథకులూ వగైరా వగైరాలు.

సగటు మానవుడు కొబ్బరి బొండాం లాంటి తన తలను మోస్తున్న మెడను పన్నెండంగుళాలు పైకి సారించి చూడ దగ్గ మనుష్యులు వీరు; ఐనా వ్యవహార దృష్టిలో నిండు సున్నాలే! వీరు ప్రొడ్యూసు చేసే ప్రొడక్ట్స్‌కు అదే రచనలకు వెలకడ్తే మార్కెట్‌లో దమ్మిడీకి కొరగావు. కానీ యిప్పుడిప్పుడే రాజకీయ నాయకులకు వీరి మహత్తు తెలిసి వస్తూ అవసరాలకు కర్పూరపు బిళ్లల్లా వెలిగించుకుంటున్నారు.

తమకు అవసరమైన వస్తువును పొగిడ్తే తప్ప దాని విలువ పలుకదు, అనే కీలకం తెలిసే నాయకులంతా తమ తమ ఆశ్రితులను పురస్కరించుకుని 'మాతృభూమిని అలంకరించే అలంకారాలు దేశ సంస్కృతికి ఎత్తిన బావుటాలు, అంటూ చేరదీస్తున్నారు.

రాజకీయ ప్రాబల్యంతో చిన్నాపెద్ద కవికళాకార నామధేయులందరికీ 'అహం' పేరుకు పోయింది. కళాధర్మాలను వెనక్కు తోస్తూ 'చీప్ పాపులారిటీకి, ఎగబాకడం మొదలైంది. ఇదేం బాగులేదు, ఇల్లు సర్వతోభద్ర రూపంలో ఎంత అందంగా కట్టినా, అప్పుడప్పుడు బూజులు దులపకపోతే మాగు వారుతుంది. పరిశుభ్రత పట్టించుకోక పాలుమాలితే కొంత కాలానికి నివాసయోగ్యం కాకుండా పోతుంది.

దేనికైనా చెలామణి ముఖ్యం. ఈ చెల్లుబాటుకు ప్రజాదరణ అవసరం అనేదే ఈసమాఖ్య ఇచ్చే కొత్త పిలుపు. ఈ సిద్ధాంతాలను ఆమోదించే ఈక్వల్ మైండెడ్ జీనియస్ అంతా ఒక చోట చేరారు. అదే 'కొత్తపిలుపు సంస్థ'.

సకాలానికే సంస్థ చేరుకున్నాడు రఘు. ఆయన యింకా మనిషి కాలేదు ఎంత ప్రయత్నించినా మనస్సుకు నిబ్బరం దొరకటం లేదు. మసకచీకట్లులా, మొదటి సారి సేవించిన మద్యం ప్రభావంలా ఏదో స్తబ్దత తనను పట్టి పీడిస్తూ వుంటే? నేను ఇక్కడ వుండటం మంచిది కాదు; బహుశః నా శరీరం విశ్రాంతిని కోరుతున్నట్లుంది, ఇంటికి వెళ్లి కాస్సేపు 'రిలాక్స్' అవుతానంటూ కుర్చీలోంచి లేచి గుమ్మందాకా వెళ్లాడు. అట్లా వచ్చిన రఘు ఎత్తిన కాలు ఎత్తినట్లే నిలబడి పోయాడు.

ఉన్నట్లుండి ఒక్కసారిగా తనతపః ఫలం తన కళ్లముందు సాక్షాత్కరించినట్లు కపటబ్రహ్మచారి శివరూపాన్ని ధరించినప్పటి పార్వతిలా ''నయయౌనతస్థౌ'' గ తయారైంది రఘు వాలకం. తాను చూస్తున్నది యింద్రజాలమా? శాబరీ ప్రయోగమా? అనుకుంటూ ఉండిపోయాడు రఘు. ఇంతలో 'హలో రఘూ! మీట్ మై ఫ్రెండ్ మిస్ అమోఘ వర్ష' అనే లాలస పరిచయ వాక్యాలతో మేల్కొన్న రఘు యాంత్రికంగా 'గ్లాడ్ టు మీట్ యు' అంటూ కరచాలనం చేయటానికి చేతులు చాపుతూ పెదాలు పలికినా, రఘు మనస్సులో జరుగుతున్న కల్లోలాన్ని తెలియజేస్తూ చాచిన చేతులు వణుకుతున్నాయి.

అమోఘ వర్ష ఆ చేతి స్పర్శకు అవకాశం ఇవ్వకుండా తప్పించుకుని సన్నగా నవ్వుతూ 'నమస్తే' అన్నది. వెయ్యి కిన్నెరలు ఒక్కసారి మ్రోగినట్లైంది. మదనుడు ఆత్రపడుతూ సజ్జితుడౌతున్నాడు.

నిండు వసంతంలా పుష్పించిన నవయౌవన శోభను అంతా అణువు అణువున నింపుకుని మోదుగు పూరసంలా రాగరసాన్ని గుమ్మరించడానికి సిద్ధంగా వున్నా చంచలాక్షుల కడకంటి చూపు వలలకు చిక్కని రఘు ఈనాడు పొందుతున్న ఆవేగానికి కారణం? అమోఘవర్ష కాదు కదా? చా! అదేం ఆలోచన? ఆ అమ్మాయిని యింతవరకు రఘు చూడందే. అయితే! ఇదంతా రాత్రి కల ప్రభావం. ఇది విచిత్రమైన డ్రీంకోయిన్సిడెన్స్ నమ్మశక్యం కాని నిజం, ఇట్ ఈజ్ ఎ ఛాలెంజింగ్ ప్రూఫ్ టు ఎస్టాబ్లిష్ ద ఫినామినా ఆఫ్ డ్రీం, యాండ్ ఇట్ విల్ బి, ఏ షాకింగ్ రియలైజేషన్ టు ద డ్రీం సైకాలజిస్ట్స్ యాండ్ ఫాలోయర్స్ లైక్ ఫ్రాయిడ్ ఎక్స్ట్రా' అంటూ అప్పటికి కలను గురించి తన మనసులో జరుపుతున్న వాఖ్యానాలూ తర్జన భర్జనలను మానుకుంటూ మెలమెల్లిగా ఈ లోకంలో ప్రవేశించాడు రఘు.

వేటగాడి గురిని తప్పించుకుని పారి వచ్చినా వదలని బాణంతో రెప్పపాటు తన ఎడమ భాగాన్ని తాకుతూ పై పొరను గీచిన భయం మాత్రం విడువక కంపిస్తున్న దుప్పిలా అయోమయ స్థితిలో తదేకంగా అమోఘ వర్షను చూస్తూ వుండిపోయాడు రఘు. మొట్టమొదటి సారిగా చూపులను వో ఆడపిల్ల ముఖం మీద కేంద్రీకరించి చూస్తున్న రఘు విపరీత స్థితిని చూస్తూన్న లాలసకు ఆశ్చర్యంతో పాటు అసూయ కూడా కలిగిన మాట నిజమే! అయినా! సంస్కారం ఆ భావాలను అట్టే కాలం కొనసాగనివ్వలేదు. లాలస తన మామూలు ధోరణిలో 'రఘూ! ఏమిటి? అలా చూస్తున్నావ్? ఏదైనా పని తొందరలో వుంటే చెప్పు? మేం నిన్నేం తప్పుగా అర్థం చేసుకోంలే! కాకపోతే? మమ్మల్ని సాదరంగా 'రమ్మంటూ'! లోపలికి ఆహ్వానించు. అంతేకాని ఫార్మాలిటీస్ కోసం తంటాలు పడ్తూ నీళ్లు నమలడం దేనికీ? 'కమాన్ మైబాయ్'! అంటూ గలగలా నవ్వింది.

సెలయేటి జల్లులు రవళించినట్లున్న ఆ నవ్వుల తరంగాలు ఆ పక్కనే కొంత దూరంలో 'బైరన్' గ్రంథాన్ని చదువుతున్న క్రాంతి చెవుల్లో అమృతవర్షం కురిపించాయి. చదివే పుస్తకాన్ని చేతిలో పట్టుకుంటూ లేచి వచ్చిన క్రాంతికి ఎదుట లాలసకు తోడుగా అరబూసిన దానిమ్మ పువ్వులా 'వర్ష' కనిపించింది.

తెలివైన కళ్లలో నవ్వులు దోబూచులాడగా 'లాలసా! కొత్తపిలుపులో ఈ కొత్తగాలిని చేరుస్తున్నావా? అన్నాడు.

అంతకన్నా చమత్కారంగా ఆ ప్రశ్నకు జవాబిస్తూ లాలాస

'క్రాంతీ! చూడు! ఇది వుత్త కొత్తగాలి కాదు, సుడిగాలి, ప్రచండ మారుతం! పేరు అమోఘ వర్ష, ఎం. ఎ. సైకాలజీ, కమ్మగా పాడుతుంది. ఇందాకే మన ప్రవరాఖ్యుడికి పరిచయం చేశానులే! నీవు తరువాయి అనుకుంటే ఆ పనీ పూర్తి ఐంది' అంటూ పరిచయ వాక్యాలు పలికింది లాలస.

ప్రవరాఖ్యుడు అన్న పదానికి స్పందిస్తూ క్రాంతి కొంటెగా చూస్తూ 'లాలసా! ప్రాంచద్భూషితాంగరుచితో వలపులు సారించిన మీ వరూధినీ మణులెవరైనా విఫల మనోరథులై రాక్కో? అంటూ నిగూఢంగా చమత్కరించాడు.

ఆ చమత్కారం కొత్తదనపు కుబుసాన్ని చీలుస్తూ కలుపుగోలు తనాన్ని భావాలకు పుంఖాలను అనుసంధిస్తూ వుంటే? అమోఘ వర్ష విచిత్రంగా క్రాంతిని చూస్తూ -

'క్రాంతీ! కొంపదీసి మీరు విసిరిన బాణాలకు గురి మా లాలస కాదుగదా?' అంటూ మూర్ఛనలు పలుకుతున్న 'వీణ'లా నవ్వుల జల్లు కురిసింది.

ఆ జల్లు తడుపుల హాయిలో దాదాపు మూర్ఛవచ్చేంత పనిగా వుంది. రఘుకు.

అనుకోని ఈ చమత్కారపు మలుపుకు ఒక్కమారు జలదరించిన క్రాంతి దీనంగా లాలసవైపు చూచాడు.

రఘు తేరుకుంటూ - 'వర్షా! ప్లీజ్! అమాయకంగా మీరు విసిరిన జోక్ ఎవరినైనా బాధించగలదు సుమా! 'ఇంతకు' అంటూ సంభాషణ సాగించాడు.

'ప్రవరాఖ్యుడు అంటూ మా గర్ల్ ఫ్రెండ్స్ నాకు ఆప్యాయంగా పెట్టుకున్న ముద్దుపేరు! 'ప్రవరాఖ్యుడు' అంటే చేతగాని అసమర్థుడు అని అర్థం. అసమర్థతకు చిహ్నంగా నా మూలాన రూఢిని కొత్తగా సంతరించుకుంటున్నది ఆ శబ్దం. నా విషయంలో ఆ అర్థమే సరి ఐంది. నిజానికి ప్రవరాఖ్యుడెక్కడా? నేనెక్కడ? ప్రవరుడు కులపాలికా ప్రణయి. పరమశాంతుడూ స్థిరచిత్తుడు. తార్తీయ పురుషార్థానికి కాకండా ధర్మ శృంగార పరిరక్షణ కోసం జీవించిన నిత్యాగ్నిహోత్రి' అంటూ చెప్పుకు పోతూ వుంటే లాలస ఆరాధనగా చూచింది రఘును.

వస్తూన్న నవ్వును లీలారేఖను మించనీయకండా ఆపుతూ, చమత్కారాన్ని కళ్లకు కొత్తకాంతిగా అలుముతూ వుంటే అమోఘ క్రాంతిని గురిచూసి 'మీరేమంటారు?' అంటూ సూటిగా ప్రశ్నించింది.

అమోఘవర్ష ప్రదర్శించిన అపురూపమైన ఆ విలాస విన్యాసం క్రాంతి యువరక్తాన్ని తొలికరిగా మూడు పొంగులు పొంగించింది. శరీరం అంతా ముంపుగా చెమటలు పోసినట్లైంది. అంతకంతకు కోరలు చాస్తూ తనను కబళింప జూస్తూన్న ప్రళయాగ్ని శిఖల్లా మణిశలాక వంటి ఆమె శరీరసౌష్ఠవం, మాటల్లో దాగిన నిగూఢ గర్వరేఖలు ముప్పు తిప్పలు పెడ్తున్నాయి. అయినా వెన్నెల వేడి వంటి ఆ సుడి గుండంలో పడకండా తప్పించుకునేందుకు వివేకాన్ని ఆశ్రయిస్తూ 'ఈ కొత్త వెలుగు ఆంతర్యాన్ని పరీక్షిస్తా'నంటూ ఆమెను వుద్దేశిస్తూ క్రాంతి -

చూడండి ! అమోఘగారూ! లాలస వరూధిని కాదు, ఆ మాట మాత్రం నిజం! రఘు' తానై తానే ప్రవరుణ్ణి కాను' అంటున్నాడు. ఒకవేళ అయితే మాత్రం వో సోనిదమ్మ

వుండి తీరాలి కదా. అంటూ సర్వసాధారణమైన రీతిలో తనకున్న చిన్నపాటి మనుచరిత్ర పరిజ్ఞానాన్ని ప్రకటించాడు. ఆ మాటలు విన్న వర్ష సమాధానం కోసం తడుముకోకండా -

'క్రాంతిగారూ! మీరు నాకు కొత్త! అయినా మీ మాట నమ్ముతానూ, గౌరవిస్తాను. తాను ప్రవరాఖ్యుణ్ణి కానంటూ చలాకీగా తప్పించుకున్నారు రఘు', మరి? మీకు ఆ పాత్రపై అభిమానం వున్నట్లుంది. మీరు పోషిస్తానంటే చెప్పండి? సోమిదమ్మలకేం కరువూ? వెదికితే దొరక్కపోతారా? అంటూ రిపార్టీ విసిరింది. ఆ విసురుకు తగిన సమాధానం చెప్పేందుకు సతమతమౌతూ క్రాంతి -

'అయితే! సోమి దమ్మకు మీరు యిష్టసఖులౌతారన్నమాట? అంటూ ప్రశ్నిస్తున్న క్రాంతికి 'ఒక్క సవరణ ప్రశ్నలో' అంటూ అడ్డు తగుల్తూ 'రాణులకూ, రాజకుమార్తెలకు యిష్టసఖులు వుంటారని విన్నాను. అనిరుద్ధప్రియా బాణపుత్రి ఐన ఉషాదేవికి ఇష్ట సఖీరూపంలో కుంభాండపుత్రి చిత్రరేఖ సహకరించినట్లు హరివంశలో చదివాను, అట్లే తదితరాలైన మరికొన్ని గ్రంథాలు యిష్టసఖులు నడిపిన సందేశాలను గూర్చిన వివరాలు ఇస్తున్నాయి. కానీ పాపం సోమిదమ్మలకు యిష్టసఖులున్నట్లు ఎక్కడా వినలేదు, ఎవరూ చెప్పలేదు, పైగా శృంగారాలకూ, విలాసాలకూ సందేశాలకూ ఉపాలంభనలకూ వుస్సురుస్సులకు సమయం సందర్భాలేవి? అందుకే యిష్టసఖుల అవసరం సోమిదమ్మలకు ఎందుకు? అంటూ ప్రశ్నార్థకంగా రఘును చూచింది.

ఉషానిరుద్ధుల ప్రసక్తితో గతరాత్రి స్వప్న వృత్తాంతం రఘును మళ్లీ కలవరపెట్టసాగింది. ఇంతకింతకు వశీకరణ శక్తిలా రఘును మైమరిపింపచేస్తున్న ఈ సంభాషణను మార్చడానికి ప్రయత్నిస్తూ 'రఘూ! ఏమిటిది. గుమ్మందాటకండానే కన్యా నిశ్చయం నుండి ఎదురుకోళ్లదాకా సాగించేట్లున్నారు. క్రాంతీ! లోపలికి వెళదాం రా! అక్కడ తాపీగా కూర్చొని చుక్కలను లెక్కపెడుతూ మాట్లాడుకోవచ్చు అంటూ లోపలికి దారి తీసింది లాలస. అవునూ విచిత్రంగా మీకేమైంది ఈనాడు? పాచి అలరూ, పాయబారిన కూడనూ, విగతమణి అయిన ఆభరణాల్లాంటి ఆ ట్రూ కాపీ మోడల్ సాహిత్యం మనకు వద్దు. 'పువ్వులు వేడుకైనా గడివోయిన వాళ్లు ముడువంగ వచ్చునే?' అంటూ పూర్వగ్రంథ పరిచయాన్ని ప్రదర్శిస్తూ మీగడ తరకల్లాంటి పదబంధాలు ఇంపైనా, పాత్రవైవిధ్యమూ, వస్తు నవ్యత లేకుండా, వాడీ వాడీ శ్రుతులు తప్పిన పాత రికార్డుల్లాంటి ప్రబంధ శృంగారాన్ని ససేమిరా చేరనీయం, అంటూ తంబురా పుచ్చుకున్న కొత్త పిలుపు నాయకమణులు ఇప్పుడు భిక్షాపాత్రలు పట్టుకుని 'ప్రేమాన్నం' 'పరమాన్నం' అంటూ అర్థించేట్టున్నారు. అంటూ తొందరపెట్టింది.

నలుగురూ గొల్లుమంటూ వారవారి మనోగతాలతో సతమతమవుతూ హాల్లోకి నడిచారు.

క్రాంతి వెళ్లి కాఫీకి ఆర్డరు వేశాడు. వస్తూ వస్తూ అమోఘవర్ష వ్యక్తి సర్వస్వాన్నీ అంచనా వేసుకున్నాడు.

క్రాంతి దృష్టిలో అమోఘవర్ష చక్కని పేరు. పేరుకు తగ్గరూపం అన్నిటినీ మించిన ఇంటలెక్టు. అది ఇంగిలీకంలా తటతటలాడుతుంది. ఇంగిలీకమే, ఏం ఖర్మ? ఆమెది పాదరసం లాంటి బుద్ధి వైభవం. కత్తి మెరుపుల్లాంటి ఆ కళ్ల కాంతలే ఆమె బహిరంతరాలను చాటి చెబుతాయి. మానసిక శాస్త్రాన్ని ఆపోశనం పట్టిన ఆపరేంగిత జ్ఞానం ముందు పైపై చదువుల బుడుబుక్కలాటలు కుప్పిగంతుల్లా ఉంటాయి. అందరి లాంటి కాకెట్ అనుకుంటే జావ కారిపోవాల్సిందే! తలపండిన తాతమ్మలా శృంగార రసచర్చా చేయగలదు. ఇంతకు ఈ రసధునిని అనుభవించే భాగ్యశాలి ఎవరో? 'చదువును, చక్కదనంబును, సంగీతము సింగారము కలిగిన యువతికి మగడు వీడు' అనే మన్ననకు వాడు నోచుకుంటాడు. తాళ్లపాక పెద తిరుమలయ్యలా'' అనుకుంటూ వచ్చి కూర్చున్నాడు.

కాఫీ వచ్చింది. అందరూ పొగలు కక్కే కాఫీ తాగుతున్నారు. సంభాషణ ఎట్లా ? ప్రారంభించాలో ఎవరికీ అర్థం కావడంలేదు. వర్షను కొత్త పిలుపు సభ్యులకు పరిచయం చేద్దామన్నా చెప్పుకోదగ్గ వారెవ్వరూ రాలేదు. నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఈ సంఘం ఆదేశాలను గూర్చీ, మారుతున్న ఈస్తటిక్ విలువల గూర్చీ, సాహిత్య ప్రక్రియలు, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ అమెరికా దేశాల్లో చిత్రకారులు చేసిన నూతన ప్రయోగాలతో ప్రభావితమౌతూ ఫారమ్ యాండ్ కంటెంట్‌ను ఎలా మార్చుకుని నవీనాకృతులతో న్యూ ఇజమ్స్‌ను ప్రెజెంట్ చేస్తూ మాడరన్ రైటర్స్‌నూ యువతనూ ఆకట్టుకుంటున్నాయో చర్చించారు.

ముఖ్యంగా ఈనాడు నవ్యత అనే పేరుతో సాహితీ విలువలను మంటగలుపుతూ 'అ, ఆ' లు రాని అర్భకుడు నేను సాహితీ సామ్రాట్టును అంటే రెండూ తెలియని సామాన్యుడు ఔనంటూ చప్పట్లు చరుస్తున్నాడు. తెలిసినా కొందరు కసితో కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చెదరంటూ లోలోపల నవ్వుకుంటున్నారు.

ఈ స్థితి దాదాపు అన్ని కళారంగాల్లో ప్రవేశించింది. కలుషితం చేస్తున్న విధానాలను గూర్చి లాలస ఆవేశంగా మాట్లాడింది. క్రాంతి రెప్పవేయకుండా లాలసను చూస్తూ మాటలను శ్రద్ధగా వింటున్నాడు.

ఇన్నాళ్లకన్నా ఆవేశంలో ఎరుపెక్కిన లాలస చెంపలు ఈనాడు క్రాంతిలో చిలిపి కోరికలు ఊరిస్తున్నాయి. లాలస రఘువైపు మొగ్గిన కారణంతో ఆమె మరో యువకునికి హృదయాన్ని విప్పేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. ప్రయత్నించినా దాన్ని మామూలు సంభాషణగా మారుస్తూ అరమరికలు లేని స్నేహభావంతో తేలికగా తేల్చివేసేది. అయినా నిరుత్సాహపడక లాలస అనుగ్రహం కోసం ఇంకా పడిగాపులు కాస్తూనే ఉన్నాడు క్రాంతి.

లాలసకు ఆ విషయం బాగా తెలుసు. రఘు మనసు ఎన్నటికైనా తన వైపు మెత్తపడక పోతుందా? అంటూ ఎదురు తెన్నులు కాస్తూనే వుంది లాలస.

ఇప్పటి అమోఘవర్ష ప్రవేశంతో ఈ ప్రేమ ఫార్ములాలో కొత్త కాంబినేషన్లు ఏర్పడేలా కన్పిస్తున్నాయి.

అనంగుడున్నాడే వాడి ప్రచారమార్గం బహుచిత్రం. వాడి ఆట కట్టించే మొనగాడేడీ? మరి పూర్వీకులే అన్నారా! ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడంటూ! తలచినప్పుడే తాత పెండ్లిగా ఎవడి తిక్క కుదుర్చాలను కుంటాడో? ఎవడి ఇనప కచ్చడాన్ని ఛేదించాలనుకుంటాడో? అమాంతం చడీచప్పుడూ కాకుండా వాడి మనస్సులో ప్రవేశించి రాయిడి పెడ్తాడు. ఇంకేముంది? జరగవలసిన పని జరిగి తీరుతుంది. స్నేహితుల సంభాషణ సాగీ సాగీ ఫ్రాయిడ్ అధివాస్తవిక సిద్ధాంతం పైన కేంద్రీకృతం ఐంది.

ఆ సందర్భంలోనే అమోఘవర్ష స్నేహితులను ఉద్దేశిస్తూ, డ్రీమ్ కాన్సెప్ట్‌ను పురస్కరించుకుని మీరెలా రియాక్టౌతున్నారు? ఇంతవరకూ నవీనులూ పాశ్చాత్యులూ చేసిన యనాలిసిస్, ఐమీన్ విశ్లేషణా, వివరణలు సరైనవేనా? కాక మన ప్రాచీనుల కృషి ఏమైనా వుందా? మీరార్జించిన జ్ఞానం అనుభవాలను మేళవిస్తూ మీరు చెప్పే నిర్వచనం ఏమిటి? అంటూ ఎంతో సీరియస్‌గా సిన్సియర్‌గా ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి నాకు తగిన స్తోమత లేదనుకుంటాను. ఐయామ్ స్టిల్ డ్రీమింగ్ అంటూ దానిమ్మ గింజల్లాంటి పళ్లను ప్రదర్శించింది. లాలస.

క్రాంతి ఆమెను అరమోడ్పు కళ్లతో చూస్తున్నాడు. సూటిగా వేసిన ఈ ప్రశ్నగాలంలా గుచ్చుకుంది. రఘును. ఈ పిల్ల ఎవరో మాంత్రిక శక్తి రూపు కట్టినట్లుంది. భూత భవిష్యవాణులు విడమర్చి చెప్పగలిగిన తాంత్రిక విద్యాప్రవీణగా వుంది. నిజానికి ఈ పిల్ల మానవ కాంతేనా? కాక భావజని ఐన కామరూపిణీ కాదు కదా! ఏదో తనకు తెలియని అద్భుత శక్తి తన స్థిమితంతో పాటూ సర్వశక్తులనూ ప్రశ్నిస్తూ వశీకరించుకోవడానికి వచ్చిన వశీకరణ విద్యలా వుంది. నిన్న రాత్రి కలలో కన్పిస్తూ తన బాహువుల్లో బంధించి తన చెంపల తారళ్యంతో, తన పెదవుల లాలిమతో, మోహావాగురంలో ముంచెత్తే కనుచూపు మధురిమలతో, తన శరీరపు సుగంధంతో, నా పంచప్రాణాలను సుగంధితం చేస్తూ గంధర్వ నగరిలో తిప్పుతూ స్వర్గద్వారాన్ని చూపిన జవ్వని, అక్షరాలా ఈ అమోఘవర్ష పోలికే!

ఈనాడంతా ఆమెను గూర్చే ఆలోచిస్తూ అదంతా తన హృదయ దౌర్బల్యం. శరీరంతో పాటు అలసిన మనసు కాంక్షించే ఒకానొక సుఖానుభూతి అంటూ సరిపెట్టుకోబోయే సందర్భంలో మహామాయా మోహినిలా, నా స్వప్నగత సుందరి నడిచి వచ్చినట్లు నా ఎదుట ప్రత్యక్షమౌతూ నా ప్రాణాలను పిండుతూ, నన్ను బంతిలా ఆడుకుంటూంది.

అంతే కాదు, ఇంతవరకూ నాగుండెలో రహస్యంగా వున్న ఆ 'కల' విషయం కలకన్నట్లుగా కలను గూర్చి భాష్యం చెప్పమంటూంది. అయినా అప్పుడే బేలపడిపోవడం ఎందుకూ? నిండా మునిగి చలి అంటే ఎలా? అంటూ గుండె దిటవు చేసుకొని అమోఘవర్షను ఉద్దేశిస్తూ :

అమోఘ! ఒక దృష్టితో డ్రీమ్ ఈజ్ నథింగ్ బట్ విష్ ఫుల్‌ఫిల్‌మెంట్ - నీ జీవితంలో తీరని ప్రగాఢమైన కోరికా బలంతో స్వప్నావస్థలో నీవు పొందే మానసిక పరివర్తనం, దానివల్ల నీవు పొందే తృప్తి. అందుకే వ్యక్తిలో ఏదో ఒక చోట నీ స్వప్నాకృతికి బలవత్తర మైన కారణం వుంటుంది. అప్పుడప్పుడు నీ కోరికలు సాఫల్యాన్ని పొదినట్లే పొంది - అంతలోకే అంతూ పొంతు లేని విరూపతనూ వికృతినీ సంతరించుకుంటూ వుంటాయి. అందుకు కారణం నీ మనస్సు. నీ మనస్సులో దాగిన ఆ కోరికా గతమైన అసంతృప్తి, దాన్ని పొందే అర్హతలను గూర్చి నీకున్న సందేహం, భయం, ఈ రెండూ కలిసి అంటే? ఈ రెండు సైకిక్ ఫోర్సెస్ 'లేదా టెండెన్సీస్' కలలో చోటు చేసుకుంటూ కోరికలను పండిస్తూ తిరగి విభ్నరూపంలో వికృతిని కలిగిస్తూ వుంటాయి. అవి మన శారీరక, మానసిక ఆరోగ్యానికి కారణం' అన్నాడు.

ఈ మాటలతో ఏకీభవించని వర్ష, బొమముడితో విలాసంగా చూస్తూ 'రఘూ! ఐయామ్ సారీ! నా అనుభవం మరోలా చెబుతూ వుంది. పూర్తిగా 'నేను' 'షెల్లింగ్' సిద్ధాంతీకరించిన స్వాప్నిక సిద్ధాంతాలతో ఏకీభవిస్తాను. డివినిటీ ఆఫ్‌డ్రీం' లో నమ్మకాన్ని పెంచుకున్నాను. వ్యక్తికనే కలలు ఆధారంగా అతడి భవిష్యత్తును చెప్పే శాస్త్రజ్ఞులు మన భారతీయులలో కూడా వున్నారు. అంతెందుకు? గౌతమ బుద్ధుని పుట్టుకకు పూర్వం మాయాదేవి స్వప్న వృత్తాంతాన్ని విశ్లేషించే కదా! ఆమెకు కుమారోత్తముడు జన్మిస్తాడని చెప్పగలిగింది! ఇట్లే విశ్లేషణా రూపంలో సిద్ధాంతీకరించే వారిలో 'అరిస్టాటిల్', ఇ.బి. టేలర్, 'హాఫ్‌నర్' మొదలైన వారెందరో వున్నారు. మీరేమన్నా సరే! కలలకు దైవీయమైన కారణం ఏదో వుంటుంది. ఇంకో విచిత్రం అంటూ సాగించింది అమోఘవర్ష.

అందరూ నిశ్శబ్దంగా వింటూ ఆరాధనగా చూస్తున్నారు. 'నా కలలో జరిగిన విషయాలను పొల్లుపోకండా చెప్పే ప్రయత్నం చేస్తాను. నమ్మలేని నిజం నమ్మండి.

కలలో జరిగిన విషయం సర్వస్వం నా అనుభవంలోకి వచ్చింది. పరిసర ప్రాంత, ఆకార, భాషా విశేషాలతో సహా చూచిన దాఖలాలు కనబడుతున్నాయి. ఇవన్నీ చూస్తూ వుంటే డ్రీమ్ ఈజ్ నాట్ వోన్లీ ప్రాడక్ట్ ఆఫ్ డ్రీమింగ్ సైకే, బట్ వి మస్ట్ ఆల్సో జడ్జ్ యిట్ యాజ్ ఎ ఇన్స్పిరేషన్ ఆఫ్ డివైన్ ఆరిజిన్' అంటూ నిశ్చయం చేసినట్లుగా బల్ల గుద్దింది.

ఈ మాటలు వింటున్న రఘు ఆమెను వేడికోలుగా చూస్తూ పిల్లవాడిలా చేతులు జోడించి గద్గద కంఠంతో 'మీకు అభ్యంతరం లేకపోతే వివరాలు చెబుతారా?' అంటూ అర్థించాడు.

ఆ పిరిస్థితిలో రఘును చూచిన లాలస 'రఘూ!' అంట పెద్దగా అరిచింది.

క్రాంతి లాలసను వారిస్తున్నట్లుగా ఆమె చేతిని గట్టిగా నొక్కాడు. సిచిఏషన్ అంతా టెన్స్‌గా మారింది. అమోఘవర్ష తన కథను సాగించింది.

'నిన్న కలలో నేను వో యువకుడితో ఎంతో చనువుగా మెదిలాను. ఇంతలో వో సుందరాంగి, బాగా అలంకరించుకుని చేతిలో పూలమాలతో వచ్చింది. అప్పుడు ఆమె ఆ యువకుడి సమీపంలో వున్న నన్ను చూచి తీవ్రమైన బాధను అనుభవించింది. అయినా ఆ బాధనంతా దిగమింగుతూ ధైర్యం తెచ్చుకుని ఆ దండను నా చేతికిస్తూ చకచకా నడిచి వెళ్లింది. నేను దండను వరమాలగా చేసి ఆ యువకుడి మెడను అలంకరించాను. ఇంతలోకే మెలకువ వచ్చింది. నవ్వుకున్నాను'.

'ఈ కల మీ అనుభవంలో నిజం అంటూ ఎలా భావిస్తున్నారు' అన్నాడు క్రాంతి.

'అదే చెప్పబోతున్నాను' అంటూ సాగింది వర్ష.

'తలవని తలంపుగా ఆ యువతి రూపంలో లాలస నాకు ఈనాడు లేడీస్ రూంలో ఎదురుపడ్డది. నా శరీరం అంతా విద్యుత్ప్రవహించింది అంటే నమ్మండి. అయినా స్థిమితపడ్డాను. తరువాత మా యిద్దరికీ మాటామాటా కలిసింది. ఆమె ఆత్మీయంగా నన్ను ఇక్కడికి తీసుకువచ్చింది. అంతే కాదు కలలో కనిపించిన యువకుని పోలికలు రఘులో చూచి నేను మరింత విస్తు పోతున్నాను. ఈ సన్నివేశానికీ కలకూ ఉన్న సంబంధాన్ని గూర్చి ఆలోచిస్తూ సతమతమవుతున్నాను' అంటూ ముగించిందో లేదో?

'రఘు వున్మత్తుడిలా లేస్తూ 'నన్ను నమ్ము వర్షా! వో నా స్వప్నసుందరీ! మై డ్రీం గర్ల్! నా ప్రాణమా! నాగంధర్వలోకమా! అంటూ రివ్వున ఎగిరి కుర్చీదాటి వచ్చి అమోఘవర్ష చేతిని చుంబించాడు. ఎవ్వరి నోటా మాట పెకలలేదు. బొమ్మల్లా చూస్తూ వుండిపోయారు.

లాలస కంట్లో రెండు కన్నీటి బిందువులు ముత్యాల్లా రాలాయి. క్రాంతి బాధగా లేస్తూ లాలస ముందుకు వంగి 'లాలసా! ప్లీజ్ పర్మిట్ మీ టు సర్వ్ యు' అంటూ ఆ ముత్యాలను తన చేతి రుమాలులో భద్రపరచుకున్నాడు.

ఓదార్పును పొందిన లాలస ప్రసన్నమైన ముఖంతో 'యూ డియర్ క్రాంతి!' అంటూ విశాలమైన క్రాంతి ఎదలో ముఖం దాచుకుంది.

రఘు అమోఘవర్షలిద్దరూ ఎమోషనల్‌గా లేస్తూ జంటగా క్రాంతీ లాలసలకు నమస్కరించారు.

క్రాంతి నవ్వుతూ 'కమాన్ ఫ్రెండ్స్! ఎవరు ఎవరికి నమస్కరించాలో? ఎవరు ఎవరికి కృతజ్ఞతలు చెప్పాలో తెలియడం లేదు. మనమంతా డ్రీం ఆడిన ఆటకు, అది చూపిన మహిమకు నమస్కరించాలి' అన్నాడు.

ఇంతలోకే తక్కిన సభ్యులంతా హుషారుగా ప్రవేశిస్తూ 'కంగ్రాచ్యులేషన్స్' అంటూ గలగలా నవ్వారు.